పని లేని సర్కారు.. పస లేని కేసు

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం, మరి ఫార్ములా ఈ కంపెనీపై ఎందుకు కేసు పెట్టలేదని నిలదీశారు. ఫార్ములా ఈ-రేస్‌లో అవినీతి జరగలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా చెప్తున్నారని గుర్తుచేశారు. ఇదే విషయమై ముఖ్య మంత్రిని అసెంబ్లీ లాబీలో మీడియా ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పలేదని విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. విలేకరులు అడిగిన ప్రతిప్రశ్నకు సావధానంగా సమాధానాలు ఇచ్చారు.

> పసలేని కేసులు.. పచ్చి అబద్ధాలతో కాంగ్రెస్ ఏడాది పాలన సాగింది. మోసపూరిత మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. మోసాలతోనే ఏడాది ముగించింది. కొత్త సంవత్సరంలోనూ రైతు భరోసా ఎగ్గొట్టేందుకు, ఆరు గ్యారెంటీలను అటకెక్కించేందుకు కుట్రలు చేస్తున్నది. -కేటీఆర్

హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేందుకే..

ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకే ఫార్ములా ఈ సంస్థకు నగదు చెల్లించామని కేటీఆర్ చెప్పారు. ఈ విషయాన్ని సదరు సంస్థ కూడా ఒప్పుకొన్నదని గుర్తుచేశారు. ఇందులో ఎలాంటి అవినీతికీ పాల్పడలేదని స్పష్టంచేశారు. కానీ, ఇందులో ఏదో మతలబు ఉన్నది.. క్యాబినెట్ ఆమోదం ఉన్నదా? అంటూ ముఖ్య మంత్రి మాట్లాడటం విడ్డూరమని చెప్పారు. మరీ అదానీకి సంబంధించి రూ.100 కోట్ల విరాళాన్ని వాపస్ ఇచ్చినప్పుడు, ఫార్ములా ఈ-రేస్‌ను రద్దు చేసినప్పుడు క్యాబినెట్ అనుమతి తీసుకున్నారా? అని ప్రశ్నించారు. రేస్‌ను రద్దుచేసిన ప్రభుత్వం, సంబంధిత సంస్థతో కాంట్రాక్ట్ ఎందుకు రద్దు చేసుకోలేదో చెప్పాలని నిలదీశారు. అవినీతి జరిగిందని ఏసీబీతో విచారణ చేయిస్తున్న ముఖ్యమంత్రి, అనవసరంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆక్షేపించారు.

ఏసీబీ కేసు ఆధారంగానే ఈడీ నోటీసులు

ఫార్ములా ఈ వ్యవహారంపై ఏసీబీ కేసు నమోదు చేసినందునే తనకు ఈడీ నోటీసులు పంపిందని కేటీఆర్ చెప్పారు. తాను ఈ కేసును కొట్టేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశానని తెలిపారు. ఒకవేళ కోర్టు కేసు కొట్టేస్తే ఈడీ కూడా విచారించే దేమీ ఉండదని స్పష్టం చేశారు. అయినా రేవంత్ సర్కారు ఆధారాలు చూపకుండా అనుమానాలపై కేసులు నమోదు చేయడం విడ్డూరమన్నారు. ఏదేమైనా ఈ విషయంపై స్పష్టత రావాలంటే కొంత కాలం వేచిచూడాల్సిందేనని చెప్పారు. గతంలో అమృత్ కుంభకోణంలో చర్యలు తీసుకోవాలని ఆధారాలతో ఫిర్యాదు చేసినా స్పందించని ఈడీ, ఇప్పుడు దూకుడు ప్రదర్శించడంలోని ఔచిత్యమేమిటో అర్థం కావడంలేదని, పొంగులేటి ఇంటిపై దాడులు చేసి నాలుగునెలలు కావస్తున్నా కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.

ఔటర్ లీజును ఎందుకు రద్దుచేయరు?

ఔటర్ రింగ్‌రోడ్డు లీజు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని సీఎం ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం దుర్మార్గమని కేటీఆర్ మండిపడ్డారు. 'అవినీతి జరిగింది.. విచారణ చేపట్టి నిగ్గుతేలుసం అని నిక్కచ్చిగా చెప్తున్న ఆయన, మరి లీజును ఎందుకు రద్దు చేయడం లేదు? అంటే ఇందులో అనుమానాలు తప్ప అవినీతి లేదనే విషయం ఆయన మాటల్లోనే స్పష్టమవుతున్నది' అని వ్యాఖ్యానించారు. 'రేవంత్‌రెడ్డి ఏడాది నుంచి నాపై కేసులు పెట్టి జైలుకు పంపాలని చూస్తున్నరు.. ఆయన ఉడత బెదిరింపులు.. పిచ్చి ప్రేలాపలనలకు భయపడబోం.. కాంగ్రెస్ సర్కార్ దురాగతాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటం'అని తేల్చిచెప్పారు. సీఎం చెప్తున్న తప్పుడు మాటలను కొన్ని మీడియా సంస్థలు పనిగట్టుకొని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా సీఎం మెప్పు కోసం పాకులాడుతున్నారని ఆక్షేపించారు.

అప్పులపై తప్పుడు లెక్కలు..

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెచ్చిన అప్పులపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తప్పుడు లెక్కలు చెప్పారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.7 లక్షల కోట్లు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. రూ 7.40 లక్షల కోట్లు అని రేవంత్‌రెడ్డి, రూ.8 లక్షల కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు ఇలా ఒక్కొక్కరు తలాతోకా లేకుండా మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. కానీ అంకెలు, లెక్కలతో హరీశ్‌రావు వారి అబద్ధాలను ఎండగట్టారని గుర్తుచేశారు. కేవలం ఏడాదికి రూ.40 వేల కోట్ల చొప్పున రుణాలు తీసుకున్న విషయాన్ని తేల్చివేశారని చెప్పారు. కాంగ్రెస్ ఏడాదిలో 1.39 లక్షల కోట్లు అప్పులు తెచ్చి ఉద్ధరించిందేమిటో అర్థంకావ డంలేదని, కనీసం ఒక్క పెద్ద ప్రాజెక్టు కూడా కట్టలేదని, ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీని కూడా సరిగ్గా అమలు చేయలేదని దుయ్యబట్టారు. 'ఢిల్లీకి మూటలు పంపిందో.. దిగమింగిందో తెలియడంలేదు' అని ఎద్దేవాచేశారు.

పార్టీ పరంగా ప్రతికూల పరిస్థితులను అధిగమించాం

బీఆర్ఎస్ నిరుడు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నదని కేటీఆర్ చెప్పారు. అటు అసెంబ్లీ, ఇటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ పరాజయం మూటగట్టుకున్నామని పేర్కొన్నారు. ఇప్పుడు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో సఫలమయ్యామని చెప్పారు. తమ పార్టీపై ప్రజలకు, క్యాడర్‌కు నమ్మకం పెరిగిందని, అందుకే నిత్యం వందలాది మంది బాధితులు తెలంగాణ భవన్‌కు వస్తున్నారని తెలిపారు. క్యాడర్‌లోనూ ఆత్మస్థైర్యాన్ని పెంచగలిగామని స్పష్టం చేశారు. ఇప్పుడు గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తున్నదని పేర్కొన్నారు.

> ఫార్ములా ఈ-రేస్‌ను రద్దుచేయడం ద్వారా 600 కోట్లను కాపాడానని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తప్పులు చెప్పారు. అదే నిజమైతే నిరుడు డిసెంబర్ 13న కంపెనీ ప్రతినిధులతో కలిసిన ఫొటోలను ఎందుకు బయటపెట్టలేదు? ఇప్పుడు బీఆర్ఎస్ సభ్యులు ఫొటోలను బయటపెడితే ఎందుకు గగ్గోలు పెడుతున్నరు? ఫొటో ఎలా బయటకు పోయిందంటూ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎందుకు బ్లాక్ మెయిల్ చేస్తున్నరు? -కేటీఆర్

పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి..

నిరుడు కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ప్రజల్లోకి తీస్కెళ్లినట్టే వచ్చే ఏడాదిలో కూడా ఇదే పంథాలో ముందుకెళ్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. పార్టీ ఏర్పాటు చేసి 25 ఏండ్లవుతున్న నేపథ్యంలో ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటామని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తామని, రాష్ట్ర అధ్యక్షుడిని కూడా ఎన్నుకుంటామని వివరించారు. పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటూనే నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారంలో ముందుంటామని స్పష్టంచేశారు. వచ్చే స్థానిక ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొంటామని పునరుద్ఘాటించారు.

కొత్త ఏడాదిలో మోసాలతోనే పాలన

కాంగ్రెస్ గతేడాది ప్రజలను మోసం చేసినట్టుగానే కొత్త ఏడాదిలోనూ అదే తరహా పాలనను ప్రారంభించబోతున్నదని కేటీఆర్ దుయ్యబట్టారు. ఇప్పటికే రుణమాఫీలో విఫలమైన సర్కారు, రైతు భరోసాకు పరిమితులు పెట్టి అన్నదాతలను నట్టేట ముంచేందుకు సిద్ధమైందని మండిపడ్డారు. అందుకే సబ్ కమిటీలు వేస్తూ రైతుభరోసాకు కొర్రీలు పెట్టేందుకు కుట్రలు చేస్తున్నదని ఫైర్ అయ్యారు. ఎన్నికల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి, ఇప్పుడు ఉన్న కోటాను ఎగ్గొట్టేందుకు కుతంత్రాలకు దిగుతున్నదని ఆరోపించారు. వారి నాయకుల చేత కేసులు వేయించి స్థానిక ఎన్నికల్లో కోటా కేటాయించకుండా కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. వచ్చే ఏడాదిని కాంగ్రెస్ ధోకా నామ సంవత్సరంగా చెప్పుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చేసిన పాపాలే ఇప్పుడు ఆ పార్టీకి చుట్టుకోనున్నాయని, పథకాల అమలులో విఫలం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లోనూ నైరాశ్యం అలుముకున్నదని చెప్పారు.

డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్, డైవర్షన్

బీఆర్ఎస్ నిధులు, నీళ్లు, నియామకాలతో పదేండ్లు పాలిస్తే, కాంగ్రెస్ డిస్ట్రక్షన్ (విధ్వంసం), డిస్ట్రాక్షన్ (కప్పిపుచ్చడం), డైవర్షన్ (మళ్లింపు) అనే త్రీడీ ఫార్ములాతో సాగిస్తున్నదని కేటీఆర్ ఎద్దేవాచేశారు. హైడ్రా, మూసీ కూల్చివేతలతో తీరని విధ్వంసం సృష్టించి పేద, మధ్య తరగతి బతుకులను చిద్రం చేసిందని నిప్పులు చెరిగారు. ఢిల్లీ పెద్దలకు డబ్బులు పంపేందుకు మూసీ ప్రాజెక్టును తలకెత్తుకున్నదని విమర్శించారు. గురుకులాల్లో 48 మంది పిల్లలు మరణిస్తే పట్టించుకోని రేవంత్‌రెడ్డి, రాజకీయ లబ్ధి కోసం సినిమా నాటకాన్ని తెరపైకి తెచ్చారని ఫైర్ అయ్యారు. 'రేవతి కుటుంబానికి ప్రతీక్ ఫౌండేషన్ రూ. 25 లక్షలు పరిహారం ఇవ్వడం సంతోషకరం.. మరి విషాహారం తిని, ఎలుకలు కరిచి మరణించిన నిరుపేద గురుకుల పిల్లలకు, కాంగ్రెస్ కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న ఆటోడ్రైవర్లకు, బలవన్మరణాలకు పాల్పడ్డ అన్నదాతలకు పరిహారం ఎందుకు ఇవ్వలేదు? నిరుపేద కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా?' అంటూ నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పీవీకి స్మారక చిహ్నం నిర్మించాలి..

కాంగ్రెస్ సర్కారు మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించేందుకు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడాన్ని బీఆర్ఎస్ స్వాగతించిందని కేటీఆర్ చెప్పారు. ఆయనకు ఢిల్లీలో స్మారక చిహ్నం నిర్మించాలని శాసనసభలో కాంగ్రెస్ సభ్యులు లెవనెత్తిన అంశానికి మద్దతిచ్చామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో విగ్రహం ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని సమర్థించామని గుర్తుచేశారు. అదే తరహాలో తెలంగాణ ముద్దుబిడ్డ, తెలుగు రాష్ట్రాలకు చెందిన తొలి ప్రధానిగా కీర్తినందుకున్న పీవీ నర్సింహారావుకు సముచిత గౌరవం ఇవ్వాలని కోరారు. వెంటనే ఢిల్లీలో ఆయన స్మారక చిహ్నం నెలకొల్పాలని, స్మృతివనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా రేవంత్ సర్కారు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు.

> ఫార్ములా ఈ-రేస్ కంపెనీకి నగదు చెల్లింపుపై నేను మాటమార్చిన అని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నరు. ఇది దుర్మార్గం. ప్రభుత్వ అనుమతి మేరకే మంత్రిగా నిర్ణయం తీసుకున్న.. మొదటి నుంచీ చెప్తున్న మాటకే నేను కట్టుబడి ఉన్న. -కేటీఆర్

అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పించిన కేటీఆర్

ఉర్సు సందర్భంగా అజ్మీర్ దర్గాకు కేటీఆర్ చాదర్ సమర్పించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ ఆధ్వర్యంలో మతపెద్దల సమక్షంలో ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి చాదర్ అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఏటా అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పించడం ఆనందంగా ఉన్నదని తెలిపారు.

గురుకులాలపై చిన్నచూపేందుకు?

'బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తుకు ఎదిగిన గురుకులాల గౌరవం, ఏడాది కాంగ్రెస్ పాలనలో ఎందుకు పడిపోయింది? ఉద్దేశపూర్వకంగానే గురుకులాలలను పక్కనబెట్టే ప్రయత్నం చేస్తున్నదా? మండలానికి ఒక్క స్కూల్‌ను పరిమితం చేసేందుకు కుట్రలు చేస్తున్నదా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం కావాలనే గురుకుల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అభద్రతా భావాన్ని పెంచుతున్నదని విమర్శించారు. ఏడాదిలో 50 మందికిపైగా పిల్లలు మరణించినా పట్టించుకోవడం లేదెందుకని సోమవారం ఎక్స్ వేదికగా నిలదీశారు. ప్రతిష్టాత్మక కార్యక్రమంటూ కామన్ డైట్‌పై హడావుడి చేసిన సీఎం, మంత్రులు ఇప్పుడు అమలుపై ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు.

లోకం పోకడ



తొందరేం లేదు సార్.. ఇంకోకాలు కూడా లేపి నిరసన వ్యక్తం చేసే వరకు చూద్దాం!

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	11.5°c	35.6°c
మెదక్	13.9°c	36.2°c
ఆదిలాబాద్	14.4°c	31.3°c
హైదరాబాద్	15.3°c	35.2°c
మహబూబ్‌నగర్	17.0°c	30.0°c
కరీంనగర్	18.0°c	30.0°c
నల్లగొండ	18.4°c	30.0°c
వరంగల్	19.0°c	30.0°c
ఖమ్మం	19.0°c	31.0°c
నిజామాబాద్	19.5°c	33.7°c

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

దవాఖానకు తీసుకెళ్లి నాలుగు రోజులుగా చికిత్స చేయించారు. సోమవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతుడి తండ్రి పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుతూ కొడుకుకు తలకొరివి పెట్టాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

జగిత్యాల జిల్లాలో మరో రైతు

కథలాపూర్, డిసెంబర్ 30: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం సిరికొండలో జరిగింది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండకు చెందిన రైతు పొన్నం ప్రసాద్(40) ఉపాధి కోసం గతంలో అప్పు చేసి దుబాయ్ వెళ్లాడు. మూడేండ్లు పనిచేసి, స్వగ్రామానికి వచ్చాడు. మరింత అప్పు చేసి వ్యవసాయం చేస్తున్నాడు. గల్ఫ్ వెళ్లేందుకు, వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోడంతో మనస్తాపం చెందాడు. ఈ నెల 14న పంట చేనువద్ద పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ప్రసాద్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో యువ రైతు మృతి

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 30 : నాగర్‌కర్నూల్ జిల్లాలో పాముకాటుతో రైతు మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. పెద్దకొత్తపల్లి మండలం పెద్ద కార్పాములకు చెందిన యువ రైతు నాగపురి శివ (28) గ్రామ శివారులో ఉన్న పొలంలో సాగు చేసిన మినుముల పంటకు నీళ్లు పెట్టేందుకు సోమవారం ఉదయం వెళ్లాడు. స్ప్రింక్లర్ పైపులను అమర్చుతుండగా.. పాముకాటుకు గురయ్యాడు. పక్క పొలంలోని రైతులు గమనించి వెంటనే అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య, కుమార్తె, కొడుకు ఉన్నాడు.

కలెక్టరేట్‌లో రైతు ముఖేశ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

నన్ను చావనివ్వండి..

భూమి హద్దులు చూపకపోవడంతో రైతు ఆవేదన

కలెక్టరేట్‌కు పురుగుల మందు డబ్బాతో వచ్చి నిరసన

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 30 : 'భూమికి హద్దులు చూపుతలేరు..కనీసం నన్ను చావనివ్వండి' అంటూ నిర్మల్ కలెక్టరేట్‌కు ఓ రైతు డీజిల్ బాటిల్, పురుగులమందు డబ్బాతో రావడం కలకలం సృష్టించింది. నిర్మల్ జిల్లా సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామానికి చెందిన ముఖేశ్ తల్లి మంగలి రాజవ్వకు చెందిన భూమి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముంపునకు గురైంది. అప్పట్లో లక్ష్మణచాంద మండలం పొట్టపల్లి కే శివారులో సర్వే నంబర్ 176లో 20 గుంటల భూమిని కేటాయించారు. ఈ భూమికి హద్దులు చూపెట్టాలని నాలుగు సంవత్సరాలుగా రాజవ్వతో పాటు ముఖేశ్ తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తుండగా ముఖేశ్ డీజిల్ డబ్బా, లైటర్, పురుగులమందుసీసాతో లోనికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. డీజిల్ వాసన రావడంతో అక్కడే ఉన్న పోలీసులు అతడిని అడ్డుకున్నారు. బ్యాగులను తనిఖీ చేసి డీజిల్ డబ్బా, పురుగుల మందు సీసాతో పాటు లైటర్‌ను లాక్కున్నారు. 'సమస్యను పరిష్కరిస్త లేరు..కనీసం నన్ను చావనివ్వండి' అంటూ ముఖేశ్ అక్కడే గట్టిగా అరవడంతో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ స్పందించి రైతును లోపలికి పిలిపించి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే రెండు మండలాల రెవెన్యూ అధికారులకు ఫోన్‌చేసి జనవరి 2 లోపు భూమి సరిహద్దులు చూపించి రైతుకు న్యాయం చేయాలని ఆదేశించారు.



కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తున్న హాజీపూర్ మండల రైతులు

భూములివ్వాలని బెదిరించారు

మొదటిపేజీ తరువాయి...

బెదిరించారని వాపోయారు. 'మేం చెప్పినట్టు వింటే ఎకరానికి రూ.13.50 లక్షలు, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటికో ఉద్యోగం ఇస్తాం' అని చెప్పి బలవంతంగా సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. హాజీపూర్ మండలం ముల్కల్ల, వేంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు బడా లీడర్లు భూముల కోసం కొద్ది రోజులుగా తమపై ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. ఎకరాకు రూ.50 లక్షలు వచ్చే భూములను రూ.13.50 లక్షలకు ఇవ్వమనడం ఎంత వరకు న్యాయమో అర్థం కావడం లేదన్నారు. తక్కువ డబ్బులు ఇచ్చి, పరిహారంగా వచ్చే డబ్బులను వాళ్ల ఖాతాల్లోకి మళ్లించుకునేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నోటిఫికేషన్ ఇవ్వకుండా అధికార పార్టీ లీడర్లు అన్యాయం చేస్తుంటే అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులే వారికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. రహస్యంగా నిర్వహించిన మీటింగ్‌కు అనధికారికంగా వచ్చిన ఆర్డీవో, తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీటింగ్‌కు వస్తే మాట్లాడుకుందామని చెప్పి తీసుకువెళ్లిన నాయకులు బెదిరించి మరీ, సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. 20 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న భూములను తీసుకుంటూ.. బెదిరించారని చెప్తున్నా సదరు లీడర్లపై, అధికారులపై చర్యలు తీసుకునే నాథుడే కరవయ్యారని వాపోయారు. చట్ట ప్రకారం ఆ భూములపై వచ్చే ప్రతి పైసా పరిహారం అర్హులకు చేరేరా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఎంత పరిహారం ఇవ్వాలనే అంశంపై ప్రభుత్వానికి ప్రపోజల్ పంపిస్తామని, నోటీసులు ఇచ్చి అందరితో మీటింగ్ పెడుతామని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారని రైతులు పేర్కొన్నారు. రైతులందరం కలిసి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తామని, న్యాయం జరిగేలా అధికారులు సహకరించాలని ఈ సందర్భంగా రైతులు విజ్ఞప్తి చేశారు.

ఆర్టీఐ వేసిన రైతులు..

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో 276.09 ఎకరాల్లో ఐటీ పార్క్ ఏర్పాటుకు భూసేకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధికార పార్టీ నాయకులు ఇందులో జోక్యం చేసుకొని రైతులను బెదిరించి సంతకాలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో రైతులు సైతం న్యాయ పోరాటానికి సిద్ధం అవుతున్నారు. 'నోటిఫికేషన్ ఇవ్వకుండా మీటింగ్ ఎలా పెట్టారు? దానికి ఆర్డీవో, తహసీల్దార్ ఎలా హాజరయ్యారు? అసలు 276.09 ఎకరాల్లో ఏ ఇండస్ట్రియల్ పార్క్ పెడుతారు? ఇది గవర్నమెంటుదా లేకపోతే ప్రైవేటుదా చెప్పాలి' అని గతంలోనే దొమ్మటి అర్జున్ అనే రైతు తహసీల్దార్‌కు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేశారు. 15 రోజులు దాటిపోయినా దానిపై వివరణ రాకపోవడంతో ఈ రోజు కలెక్టరేట్‌కు వచ్చిన రైతులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు వాళ్లకు వచ్చిన కొద్దిపాటు చదువుతో ఇంగ్లిష్‌లో ఓ ఆర్టీఐ దాఖలు చేశారు. దీనిపై దొమ్మటి అర్జున్ మాట్లాడుతూ.. ఫంక్షన్ హాల్‌లో జరిగిన మీటింగ్ అధికారికంగా జరిగిందా? అనధికారికంగా జరిగిందా? అధికారులు సమాధానం ఇచ్చి తీరాలని చెప్పారు. బెదిరించి సంతకాలు చేయించుకున్నారని ఇంత మంది రైతులు చెప్తున్నా అధికారులు కనీసం దానిపై ఎలాంటి విచారణ చేయకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని తెలిపారు. ఆర్టీఐ వేసి 15 రోజులు దాటినా ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికైనా కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కోరారు.

చేనేత కార్మికుల సమస్యలపై జంగ్‌సైరన్

- జనవరి 20న కలెక్టరేట్ల ఎదుట ధర్నా.. ఫిబ్రవరి 20న 'చేనేత గర్జన'
- బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగించాలి
- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్

రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ రమణ తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 30: సమస్యలు పరిష్కరించాలంటూ చేనేత కార్మికులు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో చేనేత గర్జన, జనవరి 20న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాకు సిద్ధం కావాలని అఖిలపక్ష సమావేశంలో నిర్ణయించారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం అధ్యక్షుడు వనం శాంతి కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేనేత కార్మికుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యలపై ఉద్యమించేవారికి పూర్తి మద్దతు ఉంటుందని, చనిపోయిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్సీ ఎలగందుల రమణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం చేనేత కార్మిక సంఘాల జేఏసీ ఏర్పాటు చేయాలని సూచించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ చేనేత ఉద్యమానికి పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని సంఘం ముఖ్య సలహాదారుడు కూరపాటి రమేశ్ మండిపడ్డారు. ప్రొఫెసర్ నరసింహారెడ్డి, సంఘం రాష్ట్ర కార్యదర్శి గంజి మురళీధర్, సహాయ కార్యదర్శి ముషం నరహరి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ఆప్కో మాజీ డైరెక్టర్ వీరన్న, చిక్క దేవదాస్, నర్వేశం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై కాంగ్రెస్ నేత అర్ధనగ్న నిరసన

- రెవెన్యూ మంత్రి, కలెక్టర్‌కు విన్నవించినా పరిష్కారంకావడం లేదని ఆవేదన
- ఇప్పటికైనా పరిష్కరించాలని ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతి

పెద్దపల్లి కలెక్టరేట్‌లోకి అర్ధనగ్నంగా వచ్చి అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతి పత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గోసిక రాజేశం

పెద్దపల్లి, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ భూమి కబ్జాపై కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధికార ప్రతినిధి గోసిక రాజేశం నిరసన తెలిపారు. స్వయంగా రెవెన్యూ మంత్రి, కలెక్టర్‌కు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి అర్ధనగ్నంగా వచ్చి నిరసన తెలుపడం సంచలనం సృష్టించింది. రాజేశం కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్ల